

కల్వర్టు పైనుంచి పారుతున్న వరద నీరు



వరదలో కొట్టుకుపోతున్న ద్విచక్రవాహనాన్ని తీసుకువస్తున్న స్థానికులు (ఫైల్)

వంతెన.. చింత తీరేనా?

చిన్న వర్షం వస్తే చాలు.. ఆ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయినట్లే.. ఎవరు కొట్టుకుని పోతారో, ఎటువంటి ప్రాణ నష్టం జరుగుతుందో, ఏ వాహనం కొట్టుకుపోతుందో తెలియని దుస్థితి. జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని పరదేశిపాలెం గెడ్డ వద్ద పరిస్థితి ఇదీ..

- చిన్న వర్షానికే పొంగిపొర్లుతున్న పరదేశిపాలెం గెడ్డ
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- స్థానిక కార్పొరేటర్ చొరవతో కదలిక
- అంచనాల రూపకల్పనకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలు
- త్వరితగతిన కార్యరూపం దాల్చాలని స్థానికుల ఆకాంక్ష

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెం గెడ్డతో స్థానికులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాపులుప్పాడ, రెడ్డీలపాలెం, పరదేశిపాలెం ప్రాంతాలవారు మధురవాడ, వైజాగ్ వెళ్లాలంటే ఈ గెడ్డను దాటుకుని వెళ్లాల్సిందే. ఇక్కడ గెడ్డపై తక్కువ ఎత్తులో చిన్న కల్వర్టు ఉండటంతో చిన్న వర్షం పడినా వరద నీరు ఈ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తుంది. సింహాచలం, మధురవాడ నుంచి వచ్చే వరద నీరు అంతా ఈ గెడ్డ నుంచే ప్రవహించడంతో వరద ఉధృతి చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా అటుగా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.



వరద లేనప్పుడు పరదేశిపాలెం కల్వర్టు పరిస్థితి



ఇటీవల గెడ్డను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

ప్రమాదం అంచున ప్రయాణం

తుపానులు, వర్షాలు పడే సందర్భాల్లో ఈ గెడ్డపై నుంచి సుమారు 4 నుంచి 5 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. ఈ క్రమంలో తెలియక ఎందరో ఈ గెడ్డ వద్ద ఇరుక్కుపోతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ గెడ్డలో కొట్టుకుని పోయిన సందర్భాలు అనేకం. వరద ఉధృతి తగ్గిన తరువాత స్థానికుల సహాయంతో ఆ కొట్టుకుని పోయిన వాహనాలను తీసుకొచ్చేందుకు నానా అవస్థలు పడేవారు.

కమిషనర్ పరిశీలన

స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు మేయర్, కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పరదేశిపాలెం గెడ్డను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న చిన్న వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు జీవీఎంసీ, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా ప్రణాళిక ప్రకారం అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే సమస్యలన్నింటికీ త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వానొస్తే భయం



భారీ వర్షాలు వచ్చాయో ఇక్కడి వారికి రాకపోకలు బంద్ అయిపోతున్నాయి. వర్షాలకు గెడ్డ పొంగిపోవడంతో అత్యవసరమైనా సాహసించి వెళ్లలేని పరిస్థితి. ఇక తుపాను వస్తే భయమే. ఈ వంతెన నిర్మిస్తే మా ప్రాంతానికి పెద్ద సమస్య తీరినట్లే.

– సాడి రమణ, పరదేశిపాలెం

కార్యరూపం దాల్చితే మేలు



స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు చొరవతో వంతెన నిర్మాణంలో కదలిక వచ్చింది. అధికారులు పరిశీలించి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కొత్త వంతెన నిర్మిస్తే చుట్టు పక్కల ప్రాంతాల వారికి తుఫాన్ సమయాల్లో రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఇది కార్యరూపం దాల్చి, వంతెన నిర్మాణం త్వరితగతిన నిర్మించాలి.

– సన్యాసిరెడ్డి, పరదేశిపాలెం

ప్రధాన సమస్య పరిష్కార దిశగా



ఏళ్ల తరబడి పరదేశిపాలెం ప్రజలను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నాం. ఇక్కడ వర్షాకాలంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నేరుగా చూడటంతో జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో ఈ సమస్యను పలుమార్లు ప్రస్తావించడం జరిగింది. ఎట్టకేలకు అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు.

– దొలపల్లి కొండబాబు, కార్పొరేటర్, 4వ వార్డు

క్లుప్తంగా

గ్రామ సచివాలయం ఏర్పాటుకు వినతి

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ పంచాయితీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. పంచాయతీలో 5వేల మంది జనాభా ఉండగా మూలకుద్దు పంచాయతీ సచివాలయ సిబ్బంది సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై స్పందించి పంచాయితీ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గంటాను కలిసిన వారిలో ఎరబాల సత్యనారాయణ, ఆనంద్, అడపాక మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

తగరపువలస: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ఆనందపురం మండలం వేములవలస హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం టీబీ ముక్తభారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరావు స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. రెండు వారాలకు మించిన దగ్గు, సాయంత్రం వేళ జ్వరం, ఆకలి మందగించడం, 60 ఏళ్లు దాటిన వారు, ధూమపానం అలవాటు ఉన్నవారు, మధుమేహ బాధితులు శిబిరంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 50 మంది స్క్రీనింగ్‌కు అర్హత కలిగి ఉండగా, 20 మంది నుంచి కఫం నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్యామలరావు, హెచ్‌వీ పార్వతమ్మ, మధురవాడ టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వీర బ్రహ్మం, సీహెచ్‌వో సూర్యకళ, సురేష్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో మధురవాడ చిన్నారుల సత్తా



పతకాలతో చిన్నారులు

మధురవాడ: ఇటీవల నిర్వహించిన మినీ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో మధురవాడకు చెందిన చిన్నారులు విశేష ప్రతిభ కనబరచి, 6 సిల్వర్, 3 బ్రాంజ్ కలిపి మొత్తంగా 9 పతకాలు కైవసం చేసుకున్నారు. వుడా కాలనీ సమీపంలోని కేఆర్ఎస్ఏ అకాడమీ స్కేటింగ్ సెంటర్‌కు చెందిన చిన్నారులు ఈ ఘనత సాధించడంతో, వారిని నిర్వాహకులు రవి కుమార్ అభినందించారు. 6 నుంచి 8 సంవత్సరాల బాలికల విభాగంలో జెస్సికా, శాన్వి సిల్వర్ మెడల్స్, 10 ఏళ్ల బాలుర విభాగంలో చరణ్ జీత్ సిల్వర్, 10–12 ఏళ్ల విభాగంలో కుసుమ రింక్–1లో సిల్వర్, రింక్–3లో బ్రాంజ్ మెడల్, 12–15 ఏళ్ల బాలికలు విభాగంలో వైష్ణవి రింక్–2, మాస్ రేస్‌లో సిల్వర్ మెడల్, సేవిత హర్షిణి మాస్ రేస్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలి

పీఎం పాలెం: సాధారణ విద్యలో ఎంత ప్రతిభ కనబరిచినా, నైపుణ్యం లేకపోతే రాణించలేరని కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) సలహాదారు వై.రామ్మోహన్ అన్నారు. జీవీఎంసీ ఆరోవార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేట్ మొబిలైజేషన్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కోర్సులకు నమోదు చేయించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: సినీ నటుడు చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ సభ్యులు భీమిలిలోని మెయిన్‌రోడ్డు పక్కన శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంగివలస ఎన్నారై ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి, మందులను అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎచ్చర్ల హరి, కదిరి జగన్నాథం,అక్కరమాని ద్వారక తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లు సత్వరమే పూర్తి చేయాలి

వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



రేవళ్లపాలెం రోడ్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విశ్వనాథన్

మధురవాడ: ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మధురవాడ జోన్‌లోని రేవళ్లపాలెం, నగరం పాలెం, ఇతర మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు సత్వరమే పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మధురవాడ అప్ బ్రిడ్జికి ఇరువైపులా అసంపూర్తిగా ఉండిపోయిన రోడ్లను పరిశీలించారు. రోడ్డు పనులు చురుగ్గా జరగకపోవడానికి కారణాలు, చేపట్టవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. టీడీఆర్, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. రేవళ్లపాలెం రోడ్డులో అప్ బ్రిడ్జి నుంచి చైతన్య స్కూలు మధ్య కాల్వ నిర్మాణానికి ఇబ్బందులు ఉంటే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర మార్గాలు కూడా అన్వేషించాలని, ఎటువంటి ఆటంకాలు లేనిచోట పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ రోడ్డులో ఉన్న భవనానికి చెందిన పోతిన హనుమంతురావు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమకు టీడీఆర్ ఇచ్చినంత వరకు పనులు చేసుకోవడానికి సహకరిస్తామని చెప్పారు.

తుపాను రక్షితభవనం పరిశీలన

నగరంపాలెం రోడ్డులో తుఫాన్ రక్షిత భవనాన్ని వీఎంఆర్‌డీఏ కమిషనర్ పరిశీలించారు. ఇక్కడి అంగన్‌వాడీ, ఇతర ఆఫీసులు వాంబేకాలనీకి తరలించాలని చెప్పారు. నగరంపాలెం చెరువు వద్ద ఉన్న రక్షిత తుపాను భవనం నుంచి వాంబేకాలనీ మీదుగా వుడా కాలనీ రోడ్డును కలిపే కనెక్టింగ్ రోడ్ల నిర్మాణ పనులు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు. అయితే విధి నిర్వహణలో ఉన్న వీఎంఆర్‌డీఏ సిబ్బంది ఐడీ కార్డులు ధరించకుండా విలేకరులపై ఆంక్షలు విధించే ప్రయత్నం చేశారు. న్యూస్ కవరేజికి ఫొటోలు, వీడియోలు తీయవద్దన్నారు.

బంగారు కుటుంబాలను ప్రోత్సహించాలి



చిప్పాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మార్గదర్శి బంగారు కుటుంబాలు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ కోరారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీ 4 ఉద్దేశాన్ని, ప్రయోజనాలను వివరించారు. స్వర్ణాంధ్ర 2047కు సహకరిస్తున్న అందరినీ అభినందించారు. దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్, ఎంఈవో శివరాణి, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, వెంపాడ సూరిబాబు, సరగడ అప్పారావు, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ సందర్శన

ఇటీవల చిప్పాడ జెడ్పీ హైస్కూల్ నూతన భవనంలోకి మారినందున ఆర్డీవో సంగీత్ మాథూర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టీలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని ఉపాధ్యాయులకు సూచించారు.

డ్రైనేజీలు ఆక్రమించి నిర్మాణాలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట గొల్లవీధి నుంచి ఆదర్శనగర్ వెళ్లే మార్గంలో చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని జీవీఎంసీ డ్రైనేజీని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. వీటిలో చాలావరకు చేతులు మారిపోతున్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో ఈ ప్రాంతంలో వర్షం కురిసిన ప్రతీసారి ఆదర్శనగర్‌కు వెళ్లే రహదారి చెరువులా మారిపోతోంది. వీధుల్లో చెత్త పేరుకుపోయి గలీజుగా మారిపోతుంది. డ్రైనేజీలను పూడ్చి నిర్మాణాలు చేపట్టినా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పైగా నిర్మాణాలు రహదారి మీదకు వచ్చేయడంతో వివిధ విద్యా సంస్థలకు చెందిన బస్సులు ఈ మార్గంలో ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకోలేకపోతున్నాయి. అంతేకాకుండా ఈ మార్గంలో ఏర్పాటు చేసిన దుకాణాల వలన స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడిన తరువాత ఈ దుకాణాల వద్ద తిష్టవేసిన ఆకతాయిలు ఈ మార్గంలో వెళ్లే మహిళలపై జులుం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, చిట్టివలస రైతు బజారు నుంచి జాతీయరహదారిని ఆనుకుని టీచర్స్ కాలనీ వరకు ఆక్రమణలు తొలగించి, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆదర్శనగర్ ప్రజలు కోరుతున్నారు.



ఆదర్శనగర్ మార్గంలో డ్రైనేజీపై నిర్మాణాలు, పోసిన డెబ్రిస్

గణపతి ఉత్సవాలకు రాట



ఉత్సవ రాట వేస్తున్న దబ్బీరు ప్రశాంతి

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సత్యనారాయణపేట గ్రంథాలయ వీధిలో గణపతి ఉత్సవాలకు స్థానికులు శుక్రవారం రాట వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా నాయకురాలు, రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి హాజరయ్యారు. అర్చకుడు గణేష్ పాల్గొన్నారు.

భూలోకమ్మ ఆలయం వద్ద అన్నదానం

తగరపువలస: ఆనందపురం బీసీ కాలనీలోని భూలోకమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఇటీవల అమ్మవారికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించిన సంగతి తెలిసిందే.

మూడో రోజూ వంటావార్పు

సూదికొండ వద్ద కొనసాగుతున్న రైతుల నిరసన



సూదికొండ వద్ద వంటావార్పు చేస్తున్న రైతులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సూదికొండ వద్ద సాగులో ఉన్న భూములను తమ అనుమతి లేకుండా ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించడాన్ని నిరసిస్తూ రైతులు చేస్తున్న వంటావార్పు మూడో రోజైన శుక్రవారం కొనసాగింది. రైతులు సూది కొండ వద్ద వంటలు చేసుకుని, మధ్యాహ్నం భోజనాలు చేశారు. గ్రామ సభ పెట్టి 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి విలువకు రెండున్నర రెట్లు అధికంగా డబ్బులు చెల్లించాలని, మొక్కలు తొలగింపునకు నష్ట పరిహారం, పారిశ్రామిక పార్కులో తమ కుటుంబాల్లో ఒక్కొక్కరికి చొప్పున ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరిస్తేనే వంటా వార్పు నిరసనను విరమిస్తామని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం భీమునిపట్నం డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

గణపతి మండపాలకు అనుమతి తప్పనిసరి

పీఎం పాలెం: వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పని సరిగా అనుమతులు పొందాలని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసుకోదలచేవారు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలీసు పరిశీలన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారని, దాన్ని ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మండపాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద మైకుల్లో శబ్దాలను పరిమితం చేయాలన్నారు. నిమజ్జన సమయంలో డీజే మ్యూజిక్‌కు అనుమతి లేదని తెలిపారు. ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా నిర్వాహకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో హెచ్చరించారు.

వరి పైరులో నిల్వ నీటిని తొలగించాలి



మద్దిలో వరి నాట్ల పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పద్మనాభం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి పైరులో నీరు నిల్వ ఉంటే తక్షణమే పైకి తీసేయాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని మద్ది, విలాస్కాన్‌పాలెం, పద్మనాభం, పొట్నూరు గ్రామాల్లో కీటక శాస్త్రవేత్త ఎం.విశాలాక్షి మృత్తిక శాస్త్రవేత్త ఎ.శిరీష, కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎ.బి.ఎం.శిరీష శుక్రవారం పర్యటించి, వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట ఏవో ఎంపీఎస్ చలం ఉన్నారు.

శ్రీ పీఠే.. సురపూజితే..

- మహాలక్ష్మి అమ్మవారిని స్తుతించిన మహిళలు
- ఆలయాలు, గృహాల్లో శ్రావణ శుక్రవార పూజలు
- రుషికొండ శ్రీవారి ఆలయంలో వెయ్యిమందితో వ్రతాలు



శాకంబరిగా వాసవి కన్యకాపరమేశ్వరి



రుషికొండ శ్రీవారి ఆలయంలో వ్రతంలో పాల్గొన్న మహిళలు

మంగళకారిణి, సౌభాగ్యప్రదాయిని అయిన లక్ష్మీ అమ్మవారిని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రీపీఠంపై కొలువుదీరి, దేవతల పూజలందుకున్న అమ్మవారిని స్తోత్రాలతో స్తుతించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా గృహాల్లో పూజలు చేశారు. ఆలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు జరిగిన ఈ వ్రతాల్లో వెయ్యి మందికి పైగా మహిళలు పాల్గొని, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



విశేష అలంకరణలో దుర్గాలమ్మ

దుర్గాలమ్మ ఆలయంలో..

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని పంచామృత, సుగంధ జలాలతో అభిషేకించి, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.



దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

108 కలశాలతో శోభాయాత్ర

భీమునిపట్నం: కీతిన్ పేట వద్దనున్న ఐశ్వర్య లక్ష్మి ఆలయం వద్ద 108 కలశాలతో ముత్తయిదువులు శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కలిగొట్ల శ్రీరామ్ పాల్గొన్నారు. భీమిలిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, పూజలు చేశారు.

108 పట్టుచీరలతో అర్చన

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో అష్టలక్ష్మీ దేవాలయంలో విశేష వస్త్రార్చనలో భాగంగా 108 పట్టు చీరలతో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి 108 పట్టుచీరలతో అర్చన



ఐశ్వర్య వేంకటేశ్వరాలయంలో 108 కలశాలతో ముత్తయిదువలు